
# మువ్వన్నెల పతాక

డా. సి. ఆనందారామం



"మరణించినా, జీవించే ధన్యత కొందరికే!
ఆ ధన్యత నీదే! నీదే! నీదే!!
మనిషంటే వెలిగే చైతన్యం:
భౌతికకాయం బుగ్గిగా మారినా,
యశః శరీరం తారామణిగా
వెలుగు బాసట, సాటివారికి ...
తరతరాల నీ జాతివారికి.
ఆ ధన్యత నీదే! నీదే! నీదే! ..."

గద్గద కంఠంతో పాడుతోంది భవాని. ఈ పాట ఆమె తండ్రి రాశాడు. ఆయన సైనికోద్యోగి.

ఎంతో ప్రయాసతో, శత్రువుల మర తుపాకి గుళ్లను తప్పించుకుంటూ, తమ మిత్రుల మృతదేహాలను స్వాధీనపరుచుకుని వచ్చారు భారతీయ సైనికులు.

ఎటు చూసినా విషాద తరంగాలు కమ్ముకుంటున్న ఆ వాతావరణంలో, వీరభారత సైనికుల హృదయాలలో నిరుత్సాహం జొరబడకుండా తన పాటలతో వారిలో నూతనోత్తేజం కల్పిస్తోంది భవాని.

మృతదేహాలు మరికొద్దిసేపట్లో వారివారి స్వస్థలాలకు వెళ్తాయి. తమ మిత్రుల కోసం బాధపడటానికి కూడా టైం లేదు వీరజవానులకి. చుట్టుపక్కల చిన్నచిన్న గ్రామాలు. నిరుపేద కుటుంబాలు. వారు ఎలాగో సైనికుల కోసం కొన్ని రొట్టెలు, టీ తయారుచేసి పంపించారు. ఆహార పదార్థాలు ట్రక్‌లో రావలసి ఉంది. ఆగటానికి సమయంలేదు. ఏదో పచ్చడితో ఉన్న రొట్టెలు పంచుకు తిని, టీ తాగి బయలుదేరారు.

ముందుగుండు సామాను, తుపాకి గుళ్లు భుజం మీద మోసుకుంటూ, ఒక చెయ్యి ఊపుకుంటూ కవాతు చేసుకుంటూ నడిచారు సైనికులు. భవాని పాట వారిని వెన్నాడుతోంది. గుండెలో ప్రతిధ్వనిస్తోంది.

మృతదేహాలు పాడవకుండా మంచుగడ్డల మధ్య ఉంచింది భవాని. ఆమె గుండె ధైర్యం చూస్తే డాక్టర్‌కి ఆశ్చర్యం!

"భవానీ! అనుక్షణం మృత్యువు దోబూచులాడే ఈ శిబిరంలో నువ్వెందుకు? వెళ్లిపోకూడదూ?" అన్నాడు డాక్టర్. ఆయన వయసు యాభై పైన. ఇరవై వసంతాల భవానిని అక్కడ చూసినప్పుడు ఆయనకు సంతోషంగానూ ఉంటుంది. గర్వంగానూ ఉంటుంది. అదే సమయంలో భయంగా కూడా ఉంటుంది.

"మృత్యువు ఎక్కడ లేదు, డాక్టర్? ఏక్సిడెంట్లూ, విషజ్వరాలూ, హార్ట్ అటాక్‌లూ మృత్యువుని ఎక్కడ తప్పించుకోగలం? నాకు చేతనైనంతగా, నా పాట వారికి మానసికంగానూ, శారీరకంగానూ నూతనోత్తేజం కల్పించటం నా జీవిత ధ్యేయం. అందుకే నర్స్‌గా యుద్ధ రంగంలోకి వచ్చాను!" చిరునవ్వుతో చెప్పింది భవాని.

"పిచ్చిపిల్ల!" లోలోపల అనుకున్నాడు డాక్టర్.

చెవులు గడియలు పడేలా యుద్ధ విమానాల చప్పుళ్లు బాంబులు కక్కిన మంటలు పొగలు ... మర తుపాకుల హోరు ...
క్షతగాత్రులను మోసుకుంటూ వైద్య శిబిరానికి వచ్చారు భారత సైనికులు. అందరి ముఖాలూ చలికి బిగుసుకుపోయి, బాంబుల పొగ అలముకుని ఉన్నాయి. బట్టలు దొక్కుపోయి, అక్కడక్కడా పేలికలై వేలాడుతున్నాయి.

ఒంటిమీద తెలివిలేని వాళ్లనీ, బాధతో మూలుగుతున్నవాళ్లనీ డాక్టరూ, భవానీ పడకల మీదకు చేర్చారు. గాయాలు కడిగి, మందులు రాసే కార్యక్రమంలో లీనమైంది భవాని. డాక్టర్ అవసరమైన ఇంజక్షన్లు చేయసాగాడు.

"చాలామందికి దెబ్బలు తగిలాయి!" అంది భవాని బాధగా.

"శత్రు సైనికిలు కొండ వెనుక నుంచి దాడిచేశారు. వాళ్ల స్థావరం మాకు తెలీలేదు. గెరిల్లా దాడిలో వాళ్లు నేర్పరులు. ముందుగా కాసుకోకపోవడం వల్ల దెబ్బతిన్నాం!" అన్నాడు సైనికాధికారి.

"నేను అక్కడే ఉండి ఉంటే నా ధర్మపతాకను శత్రు సైనికుల స్థావరానికి గుర్తుగా ఎగరేసి ఉండేదానిని!" అంది భవాని.

భవాని దగ్గర ఒక పతాక ఉంది. దానిలో మూడు రంగులు ఉంటాయి. కానీ జాతీయ పతాకలాగా ఉండదు. తెలుపు రంగు ఎక్కువగా ఉండి, పైన చిక్కని అరుణవర్ణం ఉంటుంది. క్రింద ఇంచుమించుగా నలుపులా తోచే ముదురు ఆకుపచ్చ ఉంటుంది. మధ్య విష్ణుచక్రం లాంటి చక్రమూ, దాని చుట్టూ తేజో వలయమూ ఉంటాయి.

"ఇది జాతీయ పతాక కాదు భారతీయ ధర్మపతాక. దీనిలోని రంగులు సత్వ రజ స్తమోగుణాలకు ప్రతీకలు. భారతీయులది ప్రధానంగా సాత్విక ధర్మమే. అయినా అధర్మాన్ని ఎదుర్కోవలసి వస్తే ఆ సాత్విక తేజమే, విష్ణుచక్రమై విజృంభిస్తుంది!" అని తన పతాకని వ్యాఖ్యానిస్తుంది భవాని. చిన్న స్టీల్ రాడ్‌కి చుట్టిన సిల్క్ బట్టలాంటి ఆ పతాకను ఎప్పుడూ తన హేండ్‌బాగ్‌లో పెట్టుకుంటుంది భవాని.

సైనికాధికారి నవ్వి, "నువ్వు అక్కడ ఉంటే, వాళ్లు నిన్ను బతకనిస్తారా? అదీగాక, నీ చిన్న పతాక మాకు దూరం నుంచి కనిపిస్తుందా?" అన్నాడు.

"ఇది చిన్నది కాదు, చూడండి!" అని భవాని తన హేండ్‌బాగ్‌లో నుంచి పతాక తీసి, చిన్నదిగా కనిపించే స్టీల్ రాడ్‌ని నాబ్ పట్టుకుని కిందకు లాగింది. అది దాదాపు నాలుగు మీటర్ల పొడవు సాగింది. అందరూ ఆశ్చర్యంగా చూశాక, దానిని చిన్నదిగా ముడిచి తన హేండ్‌బాగ్‌లో పెట్టుకుంది.

యుద్ధం జరుగుతున్న కొండలకి పాతిక కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న గ్రామంలో ఉంది వైద్య శిబిరం. అక్కడ అత్యవసర వైద్య సపర్యలు జరిగాక, పెద్ద ఆస్పత్రికి తీసుకెళ్తారు.

వైద్య శిబిరానికి అందవలసిన ఆహార పదార్థాలు రాలేదు. డాక్టర్, భావని నిలవ ఉన్న బన్‌లు తిని టీ తాగారు.

యుద్ధభూమిలోని తుపాకుల మోతలు ఆలోచనలను చెదరగొడుతున్నాయి.

000

అకస్మాత్తుగా ఇరవైమంది శత్రు సైనికులు మరతుపాకులతో వైద్య శిబిరంపై దాడిచేశారు. వాళ్లు సాధారణ పౌరులలాగా నటిస్తూ అక్కడికి



శ్రీ నారా చంద్రబాబు నాయుడు
రాష్ట్ర ముఖ్యమంత్రి

అవిశ్రాంత ప్రజా నాయకుడు, స్వర్ణాంధ్ర నిర్మాత, రాష్ట్ర ముఖ్యమంత్రి
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి కృతజ్ఞతాభినందనలు

రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికుల సంక్షేమం కోసం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికై పరిశ్రమించే యువ నాయకులు, మహిళాజనోద్ధారకులు, జన్మభూమి కార్యక్రమ రూపశిల్పి, రోజుకు 18 గంటలు పరిశ్రమించే కృషీవలుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి **శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు** కరీంనగర్ జిల్లా ఇందుర్తి నియోజకవర్గంలో పర్యటించి, కోర్కెలను దయతో మన్నించి వివిధ వరాలు ప్రకటించినందులకు ప్రియతమ ముఖ్యమంత్రి గారికి నియోజకవర్గాల ప్రజల
కృతజ్ఞతాభివందనాలు.

ఇందుర్తి నియోజకవర్గం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ, వివిధ పథకాలు మంజూరుచేయించి అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందిన తెలుగుదేశం రాష్ట్ర ప్రోగ్రాం కమిటీ కన్వీనర్
శ్రీ దేవిశెట్టి శ్రీనివాసరావు గారికి కృతజ్ఞతలు.


శ్రీ దేవిశెట్టి శ్రీనివాసరావు
తెలుగుదేశం రాష్ట్ర
ప్రోగ్రాం కమిటీ కన్వీనర్

ప్రకటించిన వరాలు

1. చిగురుమామిడి, హుస్నాబాద్, కోహెడ మండలాల్లోని 60 గ్రామాలకు సమీకృత రక్షిత మంచినీటి పథకానికై రూ. 15 కోట్లు మంజూరు.
2. హుస్నాబాద్ పట్టణంలో బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటుకు అనుమతి.
3. 33/11 కె.వి.ఎ. సబ్ స్టేషన్‌లు ఇందుర్తి, బెజ్జంకి, సముద్రాల మరియు నందారం క్రాసింగ్ వద్ద ఏర్పాటుకు మంజూరు.
4. హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధునీకరణకు 25 లక్షలు కేటాయింపు.
5. బలహీనవర్గాలకు 500 పక్కా ఇళ్ళ నిర్మాణానికి మంజూరు.

అభినందనలతో :

**KIMS P.G. COLLEGE**
**KIMS DEGREE COLLEGE**
**KARIMNAGAR**
Phones: 49449, 82117


డా॥ పి. రవీందర్‌రావు
M.A. M.Ed., Ph.D.
పాలకమండలి సభ్యులు
కాకతీయ యూనివర్సిటీ

చేరుకున్నారు. ఈ దురన్యాయం డాక్టర్ సహించలేక "ఆగండి! ఇక్కడ అందరూ రోగులే! మీ శత్రువులు లేరు. మీకు ఏం కావాలో చెప్పండి!" అన్నాడు.

"మాకు భవాని కావాలి. ఆవిడను మాతో పంపేస్తే వెళ్లిపోతాం!" అన్నాడు వాళ్లలో ఒకడు. ఒంటినిండా కట్లతో ఉన్న సైనికుడు "వీల్లేదు!" అన్నాడు. శత్రు సైనికుడు తుపాకి మడమతో అతడిని వెనక్కు నెట్టాడు. డాక్టర్ ముఖం పాలిపోయింది.

భవాని తన హేండ్‌బాగ్‌లోని ఒక అర జిప్ తీసింది. ఆ అరలో పొటాషియం సైనేడ్ ఉంది. ఆ పౌడర్ తన ఎడమచేతి గోళ్లలో ఇరికించుకుంది. కుడిచేత్తో ధర్మపతాకను ఫ్రాక్ జేబులో పెట్టుకుంది. ఒక రుమాలుతో సైనేడ్ ఉన్న అర ఎడమచేత్తో తుడిచి, ఆ రుమాలు మరొక జేబులో పెట్టుకుంది. ఇదంతా హేండ్‌బాగ్‌లోంచి రుమాలూ, నేప్‌కిన్ తీసి జేబులలో పెట్టుకుంటున్నట్లుగా చేసింది. ముందుకు వచ్చి, "నేను మీతో వస్తాను, పదండి!" అంది.

"గుడ్ బై, డాక్టర్! గుడ్ బై ఫ్రెండ్స్!" అని వాళ్లతో బయలుదేరింది. డాక్టర్ కన్నీళ్లతో కింద కూలబడ్డాడు.

భవానికి అటూ ఇటూ శత్రు సైనికులున్నారు. "అరిస్తే ప్రాణాలు దక్కవు!" అని నెమ్మదిగా చెప్పాడు ఒకడు.

వైద్య శిబిరం గ్రామ పొలిమేరలలో ఉంది. యుద్ధ సమయం. జనసంచారం లేదు. గడగడలాడించే చలి.

శత్రు సైనికులు ఒకరి తర్వాత ఒకరుగా ఒక గుడిసెలోకి ప్రవేశించారు. ఆ గుడిసెలో ఎవరూ లేరు. ఇంటి ముందు వైపు తలుపు వేసి వెనక వైపు తలుపు తాళం తీశారు. ఎదురుగా కొండలు. అంతటి టెన్షన్ లోనూ ఆ ప్రకృతి సౌందర్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయింది. కైలాసగిరిపై తాండవ నృత్యం చేస్తున్న శంకరుని సరసన లాస్య నృత్యం చేస్తున్న భవాని పాదాల లత్తుక కరిగి ప్రవహించినట్లుగా అరుణ కాంతులలో తెల్లని మంచుకొండలు మెరుస్తున్నాయి.

ఒక సైనికుడు పదునైన ఈటె లాంటి పనిముట్టుతో కొండలో ఒకచోట మంచును తవ్వాడు. రెండు మంచుకొండల నడుమ సన్నని దారి. ఎంత అద్భుతమైన దృశ్యం! ఒక్క మనిషి మాత్రమే నడవగలడు. చుట్టూ మంచు. ఎత్తైన కొండలు గాలిని అడ్డుకుంటున్నాయి. ఒకరి వెనుక ఒకరు త్వరగా నడుస్తున్నారు. భవాని అంత త్వరగా నడవలేకపోతోంది. లోయదారిలో అంధకారం ఆవరించుకుంది. మొదట నడుస్తున్నవాడు సన్నని టార్చ్‌లైట్ వేశాడు. ముందు నడిచేవాడిని అనుసరించటం తప్ప మరో మార్గం లేదు.

చివరకు వెలుగు కనిపించింది. సైనికుల కోలాహలం వినిపించింది. తను శత్రు స్థావరంలోకి వచ్చానని అర్థం చేసుకుంది భవాని. ఒక అధికారి ఆమె హేండ్‌బాగ్ వెతికాడు. అనుమానించవలసినవి ఏమీ లేవని నిర్ధారణ చేసుకుని తిరిగి ఇచ్చేశాడు. తర్వాత ఆమె ఫ్రాక్ జేబులు వెతికాడు. రుమాలు మడత విప్పి చూసి, తిరిగి ఇచ్చేశాడు. దానికి ఉన్న సెంట్ పరిమళం సైనేడ్‌ని కమ్మేసింది.

పతాక తీసి చూసి, "ఇదేమిటి?" అన్నాడు.

"నేప్‌కిన్!" అంది.

"రాడ్‌కి చుట్టావెందుకు?"

"అవసరాన్ని బట్టి నేను దానిని గొడుగులాగా ఉపయోగించుకుంటాను!"

అధికారి పతాకను అటూ ఇటూ తిప్పి చూసి మళ్లీ ఇచ్చేశాడు. ఆమెను తడిమి వెతికి, ఏ రకమైన ఆయుధాలూ లేవని నిర్ధారణ చేసుకున్నాడు.

"నువ్వు బాగా పాడతావని విన్నాము. నువ్వు మా ఖుషీ కోసం పాడాలి. మేము నిన్నేమీ చెయ్యము. నువ్వు మా సైనికులకు నర్సింగ్ చెయ్యాలి మాకు నర్స్ లేదు!" చెప్పాడు.

"అలాగే! తప్పకుండా పాడతాను. నర్సింగ్ చెయ్యటం నాకు చాలా సంతోషం!" అంది భవాని.

అప్పటికప్పుడు గాయపడిన కొందరు సైనికులు గాయాలు కడిగి దూదితో తుడిచి కట్లు కట్టింది. అప్పటివరకూ ప్రయాణం చేసిన తన శరీర శ్రమ కూడా లక్ష్యపెట్టకుండా ఒక హిందీ పాట పాడింది. ఆమె గానమాధుర్యంలో కొట్టుకుపోయారు అందరూ. కొందరు సైనికులు హుషారుగా లేచి ఆడారు. మరి కొందరు చప్పట్లు కొట్టారు.

సైనికాధికారి సంతోషించాడు. యుద్ధం ప్రారంభమైంది. శత్రు సైనికుల స్థావరం కొండ కొమ్ము బాగా ముందుకు రావడం వల్ల ఏర్పడిన గుహలాంటిచోట ఉంది. దూరం నుంచి కొండ కనిపిస్తుందే తప్ప లోపలి గుహ కనిపించదు. శత్రువులు గుహ అంచులకు పాకి భారత సైనికులపైకి బాంబులు విసిరి, వెంటనే గుహచాటుకు వెళ్తున్నారు. ఈ కారణం వల్ల భారత సైనికులు బైనాక్యులర్స్ లోంచి చూసినా, శత్రు సైనికుల స్థావరం కనిపించటంలేదు. భవాని గుహద్వారం పరిసరాలలో మంచు పర్వతాన్ని ఆనుకుని నిలబడింది. యుద్ధ సంరంభంలో శత్రు సైనికులు ఆమెను పట్టించుకోలేదు. ఆమె దగ్గర ఆయుధాలు లేవని వాళ్లకు తెలుసు. భవాని తన ముఖం తుడుచుకోవటానికి నేప్‌కిన్ తీసినట్లుగా ధర్మపతాక బయటకు తీసింది. చుట్టూ కట్టిన ముడి విప్పింది. పర్వత పంక్తుల్ని పరిశీలించింది. దగ్గరలో రెండు పర్వత శిఖరాల మధ్య ఎడం ఉంది. అక్కడ నుంచి అవతలి వారికి ఇవతలి దృశ్యం కనిపిస్తుంది. స్టీల్ రాడ్ పూర్తిగా నాలుగు మీటర్ల పొడవు లాగి, కుడి చేత్తో పైకెత్తి పట్టుకుని, సైనేడ్ ఉన్న ఎడమ చేతి వేలి గోళ్లు నోటికి దగ్గరగా పెట్టుకుని, పొట్టతో కొండ అంచువెంట పైకి పాకసాగింది.

ఆమె ప్రయత్నం ఫలించింది. భారత సైనికులు ఆమె ధర్మ పతాకను గుర్తించారు. సింహాల్లా శత్రుసైనికుల మీదకు ఉరికారు. శత్రు సైనికులు కూడా జరుగుతున్నది గ్రహించారు. "పట్టుకోండి!" అని అరుస్తూ ఆమె వైపుకి ఒకడు రాబోయేటంతలోనే, ఆమె తన ఎడమ చేతి వేళ్ల గోళ్లను నోట్లో పెట్టుకుని మరి కాస్త ముందుకు పాకింది. పతాకను మంచులో కూరింది. ఆమె కూలింది. భారత సైనికులు శత్రు స్థావరాన్ని స్వాధీనం చేసుకున్నారు.

భవాని పొట్ట రెండుగా చీరుకుపోయింది. బాంబుదాడికి గురై ముఖం ఛిన్నాభిన్నమైంది. అయినా, ఆమె నిలిపిన మువ్వన్నెల భారతీయ ధర్మపతాక సుస్థిరంగా నిలిచి, భారత సైనికులను ఆశీర్వదిస్తోంది.

"మరణించినా, జీవించే అదృష్టం కొందరికే!

ఆ ధన్యత నీదే! నీదే! నీదే!...." అని అశ్రునయనాలతో పాడుకున్నాడు భారతీయ సైనికాధికారి.

(ఈ కథలో పాత్రలు, సంఘటనలూ పూర్తిగా కల్పితాలు)

■

## కార్గిల్ జవానులకు కైదండలు!

కదనరంగమందు కార్గిలు వీరుని
శౌర్యకాంతిఁ గాంచ చదువులేల?
వేలకొలది పూలు విరజిమ్ము జనులంత
తిలకించవమ్మ దేశమాత!
వదలివేయబడిన వైరుల మృతులకు
మంచి చేయు బుద్ధి మనకె గలదు
కరుణ కలిగి చేయు ఖననము మనవారు
తిలకించవమ్మ దేశమాత!
ప్రాణభీతి లేని భారతజవానులు
వీరమదిని మ్రోగు విజయభేరి
గర్వమొసగు వారి కన్నుల కాంతులు
తిలకించవమ్మ దేశమాత!
పాకివానిఁ జంప భారతజగతిన
పద్మఫణుల వంటి పసిడిహారులు
కదనరంగమెక్కి గర్జించె ధైర్యంగ
తిలకించవమ్మ దేశమాత!
అమరవీరబంధు ఆత్మధైర్యమునకు
జోహారులివె! సిరుల జోహారులివె!!
మెచ్చదగిన వారి మేటి మనసులను
తిలకించవమ్మ దేశమాత!

వడలి కామాక్షి